**మంజీరా పరీవాహకంలో** ఇసుక దందా మూడు పువ్వులు, ఆరుకాయలు అన్నట్లుగా జరుగుతున్నది. టీఎస్‌ఎండీసీ ద్వారా నిర్వహించే ఇసుక రీచ్‌లను కాలపరిమితి పేరిట మూసేయించిన కాంగ్రెస్ నేతలు.. పరోక్షంగా అక్రమ రవాణాను ప్రోత్సహిస్తూ డబ్బులు సంపాదించడం మొదలుపెట్టారు. లారీలు, టిప్పర్లలో తరలిస్తే బండారం బయట పడుతుందని... అక్రమార్కులు కొత్తమార్గాలను ఎంచుకుంటున్నారు. కామారెడ్డి జిల్లాలో సుమారుగా 150ట్రాక్టర్లలో మంజీరా నది పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్నట్లుగా సమాచారం. అధికారులకు సాక్ష్యాధారాలు లభించకుండా ట్రాక్టర్లు, ట్రాలీలకు నంబర్ ప్లేట్లు తీసేసి ఇసుక రవాణాకు వినియోగిస్తున్నారు. దీంతో ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, పోలీసులకు చిక్కకుండా అక్రమార్కులు జాగ్రత్త పడుతున్నారు.

– నిజామాబాద్, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# మంజీరలో.. ఇసుక దందా!

- సర్కారు ఆదాయానికి గండి
- ఆన్‌లైన్ బుకింగ్‌లకు ఫుల్‌స్టాప్
- రీచ్‌లను మూసేసి 'నయా' వ్యవహారం
- బహిరంగ మార్కెట్లో ఎగబాకిన టన్ను ధర
- చక్రం తిప్పుతున్న మాజీ ఎమ్మెల్యే
- ఎల్లారెడ్డి నుంచి బీర్కూర్, బిచ్కుందకు పెరిగిన వలసలు



రుద్రూర్ మండలం సుంకినిలో డిసెంబర్ 25న, జనవరి 1న ట్రాక్టర్లను పట్టుకున్నారు. పొతంగల్ సమీపంలోని మంజీరా నది నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడిన వాహనాల వివరాలు ఇలా ఉన్నాయి. జనవరి 8న ఓ ట్రాక్టర్, 14న నాలుగు ట్రాక్టర్లు, 27న మరో ట్రాక్టర్, ఫిబ్రవరి 1న ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, మరో వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ మధ్యకాలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు చిక్కిన ట్రాక్టర్లు, టిప్పర్లు మామూళ్లు ఇవ్వని వారివిగా తెలుస్తున్నది.

టీఎస్‌ఎండీసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ అనుమతులతో ఇసుక రీచ్‌లు నడిపినప్పుడు ప్రజలకు ఇసుక విరివిగా లభించేది. గనుల శాఖ అధికారులు, పోలీసులతో కుమ్మక్కై వ్యాపారులు అక్రమ దందాను నడిపినప్పటికీ ఇసుక లభ్యతతో నిర్మాణాలకు సరసమైన ధరల్లోనే దొరికింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఇసుక కొరత లేకుండా ఉండేది. గడిచిన రెండు నెలల్లో ఇసుక కొరతతో ధరలకు రెక్కలు వచ్చాయి. ఇండ్లు నిర్మిస్తున్న సామాన్యులకు ఇసుక దొరకడం గగనంగా మారింది. ధరల పెరుగుదలకు తోడుగా అక్రమంగా తరలిస్తున్న ముఠాలు పెద్దఎత్తున దండుకుంటున్నాయి. బీర్కూర్‌లో రీచ్‌ల మూతతో కాళేశ్వరం నుంచి వచ్చే ఇసుక టన్నుకు నవంబర్ నెలలో రూ.1050 ఉండగా ఇప్పుడే కంగా రూ.1450 చేరింది. సన్నరకం ఇసుక ఏకంగా రూ.1800 వరకు చేరుకున్నది. ఈ మార్పును గమనిస్తున్న జనాలంతా ముక్కున వేలేసుకుంటున్నారు. పారదర్శకంగా చేపట్టాల్సిన ప్రక్రియను మూసేసి అక్రమ ఇసుక దందాను ప్రోత్సహించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పైగా ప్రభుత్వ ఆదాయానికి సైతం దొడ్డిదారిలో ఇసుక తరలింపుతో నష్టం వాటిల్లుతున్నది. నేరుగా ఇసుకాసురుల జేబుల్లోకే ఈ సొమ్ము వెళ్తున్నది. ఇంత భారీగా ఇసుక రవాణా జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకోవడం లేదు. ఫిర్యాదులు వచ్చినా ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

**అనుకూల ఖాకీలకు పోస్టింగ్‌లు...**

సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలతో పోలీస్‌శాఖలో తీవ్రమైన చర్చ జరిగింది. కానిప్పుడు అవన్నీ ఉత్త మాటలేనని తేలిపోవడంతో అక్రమార్కులకు బలం చేకూరినట్లు అవుతున్నది. ఎమ్మెల్యే సిఫార్సులకు సంబంధం లేకుండా పనితనమే గీటురాయిగా వ్యవహరించే ఖాకీలకు పోస్టింగ్‌లు ఇస్తామంటూ చెప్పినప్పటికీ అవేవి అమలు కావడం లేదు. దీంతో కాంగ్రెస్ నేతల పైరవీలతో పోలీసు అధికారులు తమకు నచ్చిన చోట పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు. ఇందులో మంజీర పరీవాహక ప్రాంతాల్లో ఈ మధ్య జరిగిన పోలీసు అధికారుల బదిలీలే ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నాయి. గతంలో ఎల్లారెడ్డి నియోజకవర్గం, నిజామాబాద్ అర్బన్‌లో పనిచేసి కళంకితుడిగా ముద్ర వేసుకున్న ఓ వ్యక్తిని తీసుకువచ్చి ఇసుక రీచ్‌లు ఎక్కువగా ఉండే ఠాణాలకు పోలీస్ అధికారిగా నియమించారు. ఈ వ్యవహారంలో ఓ ఎమ్మెల్యే, మరో మాజీ ఎమ్మెల్యే చక్రం తిప్పినట్లుగా తెలుస్తున్నది. జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లోని మండలాల్లోనైతే దూకుడు స్వభావం, చేతి చమురు భారీగా వదిలించే వ్యక్తులుగా ముద్ర వేసుకున్న వారికి పెద్దపీట వేసినట్లుగా తెలుస్తున్నది. కొంతమంది పోస్టింగ్ విషయంలో పోలీస్ ఉన్నతాధికారులు సైతం వారించినా ప్రభుత్వ పెద్దలతో చెప్పించుకోవడంతో ఐజీ స్థాయి అధికారులు కూడా ఏమీ చేయలేక సంతకాలు పెట్టినట్లుగా ప్రచారం జరుగుతున్నది.



### భారీగా పట్టుబడుతున్న ట్రాక్టర్లు..

జుక్కల్ నియోజకవర్గంలోని డోంగ్లి మండలంలో కుర్లా, సిర్పూర్ నుంచి ట్రాక్టర్లలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటకు సైతం ఇక్కడి నుంచే పంపిస్తున్నారు. రోజూ 20 వరకు వాహనాలు నడుస్తున్నాయి. ఇదంతా పోలీసులకు, రెవెన్యూ యంత్రాంగానికి తెలిసే హస్తం పార్టీ అండదండలతో జరుగుతున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదులు అందగా పైపై దాడులతో కేవలం 12వాహనాలను పట్టుకొని జరిమానా విధించారు. బిచ్కుంద మండలంలోని పుల్కల్, వాజిద్ నగర్, ఖద్గం, సెట్లూర్, హస్గుల్, బండరెంజల్ నుంచి అనుమతులు లేకుండా ఇసుకను రాత్రివేళల్లో యథేచ్ఛగా పక్కదారి పట్టిస్తున్నారు.

### కాంగ్రెస్ నేత కన్ను...

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఓ మాజీ ఎమ్మెల్యే ఏకంగా మంజీర పరీవాహకంలోనే ఎక్కువగా పర్యటించడం ఆసక్తికరంగా మారింది. సమీపంలోని ఓ గ్రామంలో సొంతింటి నిర్మాణాన్ని కూడా చేపడుతున్నట్లుగా కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. స్థానిక నేతలను కాదని పక్క నియోజకవర్గం నుంచి వచ్చి హడావిడి చేస్తున్న మాజీ ప్రజాప్రతినిధిపై లోకల్ లీడర్లు ఇప్పటికే గుస్సా అవుతుండగా ఇసుక పంచాయితీ విషయంలో వివాదం రాజుకుంటున్నది. ఇసుక రీచ్‌ల నుంచి అక్రమ తంతును ఇష్టానుసారంగా నడిపించుకునేందుకు ఇదంతా చేస్తున్నట్లుగా అర్థమవుతున్నది. సదరు నాయకుడి అండదండలతో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఇసుకాసురులుగా పేరొందిన వారంతా ట్రాక్టర్లు, టిప్పర్లతో మంజీర పరీవాహక ప్రాంతాలకు వలస వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తున్నది. మొత్తానికి మంజీర పరీవాహకంలో జరుగుతున్న సరికొత్త రాజకీయంతో స్థానిక జనమంతా నెత్తి పట్టుకుంటున్నారు.

### ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదు...

మంజీరా పరీవాహక ప్రాంతంలో ఇసుక క్వారీ లు, ఇసుక తవ్వకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. రాత్రివేళల్లో ఇసుక అక్రమ రవాణా విషయం మా దృష్టికి రాలే దు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం. తహసీల్దార్లకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. మంజీరాలో పలుచోట్ల వాహనాల రాకపోకలు జరుగకుండా కందకాలు తవ్వించాం. సిబ్బంది కొరతతో తనిఖీలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అక్రమంగా ఇసుక తవ్వితే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాం.

– భుజంగరావు, ఆర్డీవో, బాన్సువాడ

# బాలుడు దొరికాడు

**మోర్తాడ్‌లో వదిలేసిన నిందితులు**
**తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు**



నిజామాబాద్‌లో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

మోర్తాడ్/ వినాయక్‌నగర్, ఫిబ్రవరి 6: నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్‌లో కిడ్నాప్ అయిన బాలుడు క్షేమంగా దొరికాడు. మోర్తాడ్ మండల కేంద్రం శివారులోని డంపింగ్ యార్డు వద్ద ఏడాది బాబు బుధవారం దొరికాడు. పారిశుద్ధ్య కార్మికుడు దుర్గయ్యకు పాలెం రోడ్డుపై ఉన్న వరదకాలువ పక్కన ఉన్న డంపింగ్‌యార్డులో బాలుడు ఏడుస్తూ కనిపించాడు. పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో అనుమానం వచ్చి దుర్గయ్య బాలుడిని తీసుకువచ్చి కార్యదర్శి రామకృష్ణకు విషయాన్ని తెలియజేయడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ టీచర్ జ్యోతితో కలిసి బాబును మోర్తాడ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. విషయం తెలుసుకున్న ఎస్సై అనిల్‌రెడ్డి నిజామాబాద్ రూరల్ పోలీసులకు అప్పజెప్పారు.

**దొరికిపోతామన్న భయంతోనే...**

ఉన్నతాధికారుల ఆదేశాలతో బాలుడి కోసం సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్, ఎస్సై మహేశ్ తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం బాలుడు మోర్తాడ్ పోలీసుల చెంతకు చేరాడు. కిడ్నాప్‌కు గురైన బాలుడు, నిందితులైన జంట ఫొటోలు పత్రికల్లో రావడంతో ఎక్కడ దొరికిపోతామోనన్న భయంతో బాలుడిని వదిలేసి పారిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఏదీ ఏమైనా కిడ్నాప్ అయిన బాలుడు సురక్షితంగా దొరకడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నది. బాలుడిని తల్లిదండ్రులు సాయమ్మ, హరిప్రసాద్‌లకు అప్పగించి, కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.



ఎల్లారెడ్డిలో వివరాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది

# 'గృహజ్యోతి' కోసం వివరాలివ్వండి

**వినియోగదారులకు విద్యుత్ అధికారుల సూచన**

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 6: గృహజ్యోతి పథకం వర్తింపు కోసం వినియోగదారులు వివరాలు సమర్పించాలని ఉమ్మడి జిల్లా విద్యుత్ అధికారులు కోరారు. మీటర్ రీడింగ్ కోసం వచ్చే సిబ్బందికి ఆధార్, రేషన్ కార్డులు చూపి మీ సర్వీస్ (యూఏఎన్)నంబర్‌తో అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. గృహాలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తామన్న హామీ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పథకాన్ని అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. కరెంట్ బిల్లులు తీసేందుకు ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి రేషన్, ఆధార్ కార్డు వివరాలు ఇస్తే వాటిని సర్వీస్ నెంబర్‌తో అక్కడే అనుసంధిస్తారని విద్యుత్ అధికారులు తెలిపారు. ఆయా వివరాలను అప్‌డేట్ చేసుకున్న వారు మాత్రమే గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధి పొందుతారని వివరించారు.

# రక్తమోడిన రహదారులు

**కామారెడ్డి జిల్లాలోని** రహదారులు రక్తసిక్తమయ్యాయి. సోమవారం రాత్రి, మంగళవారం వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. కారు, బైకు ఢీకొని ఇద్దరు, బైక్, ట్రాక్టర్ ఢీకొని ఒకరు, లారీ, బైక్ ఢీకొని మరొకరు మృతిచెందారు.

– పెద్దకొడప్‌గల్ / డోంగ్లీ / సదాశివనగర్, ఫిబ్రవరి 6



పోచారం చౌరస్తా వద్ద ప్రమాదస్థలంలో ధ్వంసమైన కారు, బైకు

## వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

**కారు ఢీకొని ఇద్దరు..**

పెద్దకొడప్‌గల్ మండలంలోని పోచారం చౌరస్తా వద్ద 161 నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం బైక్, కారు ఢీకొన్న ఘటనలో మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు చెందిన వెంకటేశ్ శ్యాంబాజీ బన్సుడే (25), వాగ్మారే నిఖిల్(20) మరణించగా సూర్యవంశీ సోంనాథ్‌కు తీవ్రగాయాలయ్యాయి. పెద్దకొడప్‌గల్ మండలంలోని తలాబ్‌తండాలో ఇంటికి స్లాబ్ వేయడానికి ముగ్గురు బైక్‌పై బయల్దేరారు. పోచారం చౌరస్తా వద్ద వీరి బైక్‌ను హైదరాబాద్ నుంచి దెగ్లూర్ వైపునకు వెళ్తున్న కారు ఢీకొన్నది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

**ట్రాక్టర్ ఢీకొని ఆరేండ్ల చిన్నారి..**

డోంగ్లీ మండలం వాడి గ్రామానికి చెందిన రాజు, వరుసకు కూతురు అయిన సాన్విక(6), చందుతో కలిసి బైక్‌పై సోమవారం రాత్రి మద్నూర్ నుంచి స్వ గ్రామానికి వస్తున్నారు. తడిహిప్పర్గా, లింబూర్ మధ్యలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్నది. ప్రమాదంలో సాన్విక అక్కడికక్కడే మృతిచెందగా.. రాజు, చం దుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను నిజామాబాద్ దవాఖానకు తరలిం చి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మద్నూర్ ఎస్సై కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు.



ప్రమాదంలో మరణించిన సాన్విక(ఫైల్)

**అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..**

కామారెడ్డి మండలంలోని టేక్రియాల్ గ్రామానికి చెందిన చీకోటి బుగ్గ రాములు(53) సదాశివనగర్ మండలంలోని కల్వరాల్ గ్రామంలో మంగళవారం జరిగిన తమ బంధువు అంత్యక్రియలకు వెళ్లాడు. తిరిగి బైక్‌పై వస్తుండగా.. సదాశివనగర్‌లోని 44వ జాతీయ రహదారిపై చెరుకు లోడ్‌తో వస్తున్న లారీ బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

# మహాలక్ష్మీపై నేటి నుంచి సర్వే

- తప్పుల సవరణకు ప్రత్యేక బృందాలు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 6: ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకం కోసం ప్రజలు సమర్పించిన దరఖాస్తులపై నేటి నుంచి ప్రత్యేక బృందాలు సర్వే నిర్వహించనున్నట్లు నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల్లో తప్పిదాల సవరణకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద వంట గ్యాస్ సిలిండర్ రూ.500కు అందించేందుకు సమగ్ర వివరాలు అవసరమని పేర్కొన్నారు. గ్యాస్ ఏజెన్సీ పేరు, వినియోగదారు నంబర్,రేషన్ కార్డు నంబర్ వంటి వివరాలు పలువురు సరిగ్గా పొందుపర్చలేదని, అలాంటి దరఖాస్తులను సర్వే చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎంపీడీవో, తహసీల్దార్లు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు, ఇతర అధికారుల నేతృత్వంలో సర్వే జరుగుతుందన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

# నేడు బాన్సువాడలో బీఆర్‌ఎస్ సమావేశం

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 6: బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బాన్సువాడ పట్టణంలోని కొల్లూర్ రోడ్ సమీపంలో ఉన్న ఎస్‌ఎంబీ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బీఆర్‌ఎస్ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

